

# ఓ మహాత్మా!

ఓ మహాత్మా, ఓ మహర్షి !
ఏది చీకటి, ఏది వెలుతురు ?
ఏది జీవిత, మేది మృత్యువు ?
ఏది పుణ్యం, ఏది పాపం ?
ఏది నరకం, ఏది నాకం ?
ఓ మహాత్మా !

ఏది సత్యం, ఏ దసత్యం ?
ఏ దనిత్యం, ఏది నిత్యం?
ఏది ఏకం, ఏ దనేకం ?
ఏది కారణ, మేది కార్యం ?
ఓ మహాత్మా !

ఏది తెలుపు, ఏది నలుపు ?
ఏది గానం, ఏది మౌనం ?
ఏది నాది, ఏది నీది ?
ఏది నీతి, ఏది నేతి ?
ఓ మహాత్మా !

ఏ దహింస, ఏది హింస ?
ఏది కష్టం, ఏది సౌఖ్యం ?
ఏది నష్టం, ఏది లాభం ?
ఏది మంచి, ఏది చెడుపు ?
ఓ మహాత్మా !

నిన్న స్వప్నం, నేటి సత్యం–
నేటి ఖేదం, రేపు రాగం–
ఒకే కాంతి, ఒకే శాంతి–
ఓ మహర్షి, హే మహాత్మా !

—శ్రీ శ్రీ